## కేసీఆర్‌కు మద్దతుగా నేడు 'చలో తెలంగాణ భవన్'

బడంగ్ పేట్, జూన్ 10: కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరవుతున్న ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మద్దతుగా నేడు ఉదయం 9.30 గంటలకు 'చలో తెలంగాణ భవన్'కు తరలిరావాలని మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి .సబితా ఇంద్రారెడ్డి ఆదేశానుసారం మహేశ్వరం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మద్దతు తెలియజేయాలన్నారు.

### మీర్‌పేట మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు

## తీగల రంజిత్ రెడ్డి మృతి



మలక్ పేట జూన్ 10: మీర్ పేట గ్రామ మాజీ ఎంపీటీసీ, మలక్ పేట సలీంనగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు తీగల రంజిత్‌రెడ్డి మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను వారం రోజుల క్రితం కుటుంబ సభ్యులు బేగంపేటలోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. చికిత్స పొందుతుండగా ఆయన పరిస్థితి విషమించడంతో సోమవారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచారు. 2006, 2014లో రెండుసార్లు మీర్ పేట ఎంపీటీసీగా గెలుపొంది ప్రజలకు సేవలు అందించారు. అదేవిధంగా 2016లో జరిగిన జీహెచ్ఎంసీ కార్పొరేషన్ ఎన్నికల్లో మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్‌గా సోదరుడు తీగల అజిత్ రెడ్డి సతీమణి సునారితారెడ్డిని గెలిపించుకుని మంచి సత్తా గల నాయకుడిగా గుర్తింపు పొందారు. రంజిత్ రెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న పెద్ద కూతురు గురువారం స్వదేశానికి తిరిగి వస్తున్నందున అదే రోజు స్వగ్రామమైన మీర్ పేటలో అంత్యక్రియలు నిర్వహించనున్నామని వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

### సలీంనగర్‌లో విషాదఛాయలు

మూసారాంబాగ్ డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకుడిగా చిరపరిచితుడైన రంజిత్ రెడ్డి మరణ వార్తతో సలీంనగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. అందరితో కలివిడిగా ఉండే రంజిత్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడన్న మరణ వార్తను డివిజన్ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు.


### సుభాష్‌రెడ్డి కుటుంబాన్ని వెంటాడుతున్న విషాదాలు

తీగల సుభాష్ రెడ్డి కుటుంబాన్ని విషాదాలు వెంటాడుతున్నాయి. సుభాష్ రెడ్డి చిన్న కుమారుడు అజిత్ రెడ్డి కుమారుడు ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెంది నాలుగు నెలలైనా గడవకముందే సుభాష్ రెడ్డి పెద్ద కుమారుడు రంజిత్ రెడ్డి మరణించడం వారి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. సుభాష్ రెడ్డి కూడా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొంది ఆదివారమే డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్న మరుసటిరోజే రంజిత్ రెడ్డి మరణించడం వారి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. నాలుగు నెలల వ్యవధిలోనే కుటుంబంలో ఇద్దరు వ్యక్తులు చనిపోవడంతో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు.

# రేపటితో ముగియనున్న రెవెన్యూ సదస్సులు

### 74 దరఖాస్తులు రైతుల నుంచి వచ్చాయి : తహసీల్దార్ ఇందిరాదేవి

బడంగ్ పేట్, జూన్ 10: బాలాపూర్ మండల పరిధిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు మంగళవారంతో ముగిశాయి. జూన్ 3 నుంచి10 తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ ఇందిరా దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు సజావుగా ముగిసినట్లు ఆమె పేర్కొన్నారు. 74 మంది రైతులు ఫిర్యాదులు చేశారు. ఎక్కువ శాతం నిషేధిత జాబితాలో ఉన్న భూముల గురించి ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి తహసీల్దార్ పరిధిలో ఉంటే అక్కడే పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల గురించి వచ్చిన దరఖాస్తులను పై అధికారుల ఆదేశాల మేరకు పరిశీలించడం జరుగుతుందన్నారు. నేటితో ముగియనున్న రెవెన్యూ సదస్సులు 12వ తేదీ వరకు పొడిగించినట్లు డీటీ మణిపాల్ రెడ్డి పేర్కొన్నారు.



నాదర్గుల్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న తహసీల్దార్ ఇందిరా దేవి

బుధవారం నాదర్గుల్‌లో రెండవసారి రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. మామిడిపల్లిలో గురువారం రెవెన్యూ సదస్సు ఉంటుందన్నారు. రైతుల అభ్యర్థన మేరకు సదస్సు నిర్వహించాలని కందుకూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి ఆదేశించడంతో రెండవసారి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తహసీల్దారు ఇందిరా దేవి పేర్కొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్

ఆర్కే పురం, జూన్ 10 :జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు జూన్ 14న రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్టులలో లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ అన్నారు. ఇదివరకు కోర్టు ముందుకు రాని కేసులు కానీ, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు కానీ పరిష్కరించుకునే, రాజీ చేసుకునే వేదిక ఈ లోక్ అదాలత్ అని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లలో కేసు దాఖలు చేసినప్పుడు కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న కేసు లోక్ అదాలత్‌కు పంపబడి, ఆ తర్వాత పరిష్కరించబడినట్లయితే, వాస్తవానికి కోర్టులో చెల్లించిన కోర్టు రుసుము కూడా పార్టీలకు తిరిగి చెల్లించబడుతుందన్నారు.

ఈ లోక్ అదాలత్‌ల ద్వారా సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటుందన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి పడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, డబ్బు రికవరీకి సంబంధించిన కేసులు, మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు, చిట్ ఫండ్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, ఇతర రాజీకి వీలున్న కేసులు పరిష్కరించుకోవచ్చు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజీ మార్గమే రాజ మార్గం మనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

## రేమండ్ సమాధులు పరిశుభ్రం చేయాలి



పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రనాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్, జూన్ 10: సైదాబాద్ డివిజన్ పరిధి ఆస్మాన్ ఘడ్ లోని చారిత్రాత్మక రేమండ్ సమాధులను పరిశుభ్రం చేయాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు రవీందర్ రెడ్డి మంగళవారం పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రనాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రేమండ్ సమాధుల ప్రాంతంలో పిచ్చి చెట్లు, చెత్త చెదారం, పొదలు తయారై పరిసర కాలనీలు, బస్తీలలోకి విష సర్పాలు, పురుగులు వస్తున్నాయని, దీంతో స్థానికులకు హాని కలుగుతుందన్నారు. చారిత్రకమైనటువంటి ప్రాంతాన్ని శుభ్రంగా చేసి, పరిసర ప్రాంతాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజారాం, దిలీప్, చందర్ గౌడ్ పాల్గొన్నారు.

## హోంగార్డులను సొంత రాష్ట్రానికి పంపించాలి

కాచిగూడ, జూన్ 10: తెలంగాణలో కొన్ని ఏళ్లుగా పనిచేస్తున్న ఏపీ హోంగార్డులను సొంత రాష్ట్రానికి బదిలీ చేయాలని హోంగార్డుల జాయింట్ సెక్రటరీ ఎస్.నారాయణరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాచిగూడలో హోం గార్డు ప్రతినిధులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఏపీకి చెందిన 400 మంది హోంగార్డులు తెలంగాణలో పనిచేస్తున్నారని, తమ కుటుంబాలు మాత్రం ఏపీ లోనే ఉన్నారని పేర్కొన్నారు. పిల్లలను స్కూల్లో చేర్చాలని, కొంతకాలంగా ఇక్కడే విద్య నభ్యసిస్తే ఏపీలో స్థానికత కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం పట్టించుకొని తమను ఏపీ రాష్ట్రానికి పంపించాలని వేడుకున్నారు.

### హనుమాన్ ఆలయాన్ని సందర్శించిన

## మంత్రి వాకిటి శ్రీహరి



ధ్యానాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

చంపాపేట, జూన్ 10: ఎంతో ప్రసిద్ధి చెందిన చంపాపేట్ డివిజన్ కర్మన్ ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయాన్ని ఇటీవల రాష్ట్ర మంత్రిగా ప్రమాణం చేసిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంగళవారం కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కార్య నిర్వహణాధికారి ఎన్. లావణ్య సమక్షంలో పూర్ణ కుంభంతో ఆలయంలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పేద పండితులు వారికి స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం మంత్రి ఆలయ ఈవో లావణ్యతో మాట్లాడుతూ, ఆలయ ప్రతిష్ట గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ నూతన చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణ రెడ్డి, ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరపాలి

బడంగ్ పేట్, జూన్ 10: రిజర్వేషన్లు ఉపయోగించుకొని మాదిగలు సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని బడంగ్ పేట్ ప్రజా భవన్‌లో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని నేతలు పిలుపునిచ్చారు. తరతరాలుగా వివక్షతకు గురైన మాదిగలు ఇప్పుడిప్పుడే రాజ్యాంగ ఫలాలను ఎస్సీ వర్గీకరణ ద్వారా పొందుతున్నారని ఉపేందర్ మాదిగ అన్నారు. సమాజంలో అనేక అవమానాలు, అవహేళనకు గురవుతున్న మాదిగలకు అస్తిత్వాన్ని, ఆత్మ గౌరవాన్ని, హక్కులను, రాజకీయ చైతన్యాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. రిజర్వేషన్ హక్కుల కోసం పోరాడుతూనే మరోవైపు నిరాదరణకు గురైన వర్గాలైన దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల కోసం పోరాడి వారికి పెన్షన్లు సాధించడం జరిగిందన్నారు. గుండె జబ్బుల చిన్నారులకు ఉచిత ఆపరేషన్లు, ఆరోగ్యశ్రీ పథకం, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు, తెలంగాణ అమరుల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పనలో మందకృష్ణ పాత్ర ఉందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కోసం నిబద్ధతతో నిలబడతామన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోల్ల నరసింహ మాదిగ, రావుగళ్ళ బాబు మాదిగ, బక్కని రవి మాదిగ, ఎర్ర కృష్ణ మాదిగ, ఎర్ర గణేశ్ మాదిగ, ఎర్ర నవీన్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆర్కే పురం, జూన్ 10: సాయి కాలనీ, గ్రీన్‌హిల్స్ కాలనీ, టీఎస్ హౌసింగ్ బోర్డ్, బీరప్ప దేవాలయం, అష్టలక్ష్మి దేవాలయం, ఎల్బీ నగర్, సిరీస్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం ఈ దిగువ తెలిపిన ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు సరూర్‌నగర్ విద్యుత్ శాఖ డీఈ తెలిపారు. సాయి కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సాయి కాలనీ, ఆర్కే పురం, ఓల్డ్ హయత్ నగర్ పరిసర ప్రాంతాలు. గ్రీన్ హిల్స్ కాలనీ ఫీడర్ పరిధిలో గ్రీన్ హిల్స్ కాలనీ, కృష్ణానగర్, మోయ నగర్, ద్వారకమయినగర్ పరిసర ప్రాంతాలు. టీఎస్ హౌసింగ్ బోర్డ్ ఫీడర్ పరిధిలో హిందూ అరణ్య అపార్ట్మెంట్స్, హిందూ అరణ్య విల్లాస్ పరిసర ప్రాంతాలు. బీరప్ప దేవాలయం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇన్ఫర్మేషన్ కాలనీ, వసుంధర ఎన్‌క్లేవ్, గరుడ నగర్, సాయి కాలనీ, శిరిడి సాయి నగర్, సత్యనారాయణ కాలనీ, గజ్జి పుల్లయ్య కాలనీ పరిసర ప్రాంతాలు. అష్టలక్ష్మి దేవాలయం ఫీడర్ పరిధిలో అష్టలక్ష్మి దేవాలయం పరిసర ప్రాంతాలు. వాసవీ కాలనీ పరిసర ప్రాంతాలు. ఎల్బీనగర్ పరిధిలో మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు సరస్వతి నగర్, చింతలకుంట, సూర్యోదయ కాలనీ పరిసర ప్రాంతాలు. సిరీస్ ఫీడర్ పరిధిలో సెంట్రల్ బ్యాంక్ కాలనీ, సూర్యోదయ కాలనీ, సరస్వతి నగర్, మధురానగర్, హకీమా బాద్ కాలనీ పరిసర ప్రాంతాలు. వినియోదారులు సహకరించాలని డీఈ కోరారు.

### సైదాబాద్‌లో..

సైదాబాద్, జూన్ 10 : విద్యుత్ మరమ్మతుల కారణంగా లక్ష్మీ నగర్ కాలనీ సబ్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీ సబ్ స్టేషన్ 33/11కేవీ విజయనగర్ కాలనీ ఫీడర్ పరిధిలో బుధ వారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చంపాపేట ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్షకాలాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం మధ్యాహ్నం 2: 30 గంటల నుండి సాయంత్రం 5: 30 గంటల వరకు, వినయ్ నగర్ ఫీడర్ పరిధిలోని కృష్ణా నగర్, వినయ్ నగర్, ఎన్ఎస్ఆర్ కాలనీ, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, శ్రీనివాస్ నగర్, బాలాజీ నగర్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఆస్మాన్ ఘడ్ డివిజన్ పరిధిలోని 11కేవీ సైదాబాద్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, 11కేవీ జయ నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కందుకూరు, జూన్ 10: మండల పరిధిలోని లేమూరు గ్రామంలో అవేర్ మాధవన్ జి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రజలు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్లు ప్రభాకర్, శ్రీకాంత్ దాదాపుగా 150 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మాజీ ఎంపీటీసీ మంచాల యాదయ్య మాట్లాడుతూ, అవేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాణా ప్రతాపరెడ్డి, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

### బతుకమ్మకుంట స్టేటస్‌కో పొడిగింపు

అంబర్‌పేట, జూన్ 10 : అంబర్‌పేట మండలం బతుకమ్మకుంటలో గల ఏడు ఎకరాలపై ఎడ్ల సుధాకర్ రెడ్డి హైకోర్టులో వేసిన సీఎంఏ(సివిల్ మిసిలియన్ అప్పీల్)లో మంగళవారం కోర్టు స్టేటస్‌కోను జూలై ఒకటికి పొడిగించింది. హైకోర్టు వెకేషన్ బెంచ్ మే 7వ తేదీన ఇచ్చిన స్టేటస్‌కో ఆర్డర్స్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ పొడిగించిందని బీఆర్ఎస్ నాయకుడు ఎడ్ల సుధాకర్‌రెడ్డి తెలిపారు. అలాగే మే 28న హైకోర్టు మూడవ వెకేషన్ ఇచ్చిన స్టేటస్ కో మోడిఫికేషన్ ఆర్డర్ సబ్జెక్టు భూమిది కాదని క్లారిఫై చేసిందని చెప్పారు. ఈ ఆర్డర్‌తో హైడ్రా గొంతులో వెలక్కాయ ఇరుక్కున్నట్లయిందన్నారు.

## వందరోజుల యాక్షన్ ప్లాన్‌పై అవగాహన కార్యక్రమాలు



మీర్ పేట్ పరిధిలో ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న కమిషనర్ జ్ఞానేశ్వర్



తుక్కుగూడ మున్సిపాలిటీలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న కమిషనర్ వాణిరెడ్డి.



బడంగ్ పేట్‌లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న కమిషనర్ సరస్వతి

బడంగ్ పేట్, జూన్ 10: మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్, మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో వందరోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఉచిత వైద్య శిబిరాలు, పారిశుధ్యం, నాలాల పూడికతీత, మ్యాన్‌హోల్స్ క్లీనింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి మున్సిపల్ సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కాలనీలలో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. రోడ్ల పైన చెత్త వేయకుండా చెత్త ఆటోలో వేయాలని సూచించారు.

మహేశ్వరం నియోజకవర్గ వ్యాప్తంగా వందరోజుల యాక్షన్ ప్లాన్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ కమిషనర్ సరస్వతి, మీర్ పేట్ కమిషనర్ ఆర్. జ్ఞానేశ్వర్, తుక్కుగూడ కమిషనర్ వాణి రెడ్డి, జల్ పల్లి కమిషనర్ వెంకట్‌రామ్, అధికారులు చంద్రశేఖర్ రెడ్డి, నాగేశ్వరరావు, వేణుగోపాల్ రెడ్డి, వెంకన్న, వంకాయల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు, జూన్ 10: తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఎస్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కందుకూరు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. నళినిమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులలో ప్రవేశాలకు 2024-25 విద్యా సంవత్సరం పదవ తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు 13-06-2025 ఉదయం 11గంటలకు గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల, కందుకూరు, మహేశ్వరంలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు బదిలీ ధృవీకరణ పత్రం, పదవ తరగతిలో సాధించిన మార్కుల మెమో (2024-25), స్టడీ, కండక్ట్ సర్టిఫికేట్స్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు(2024-25(గ్రామీణ ప్రాంతానికి చెందిన వారు రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతానికి చెందిన వారు రూ.2లక్షలకు మించరాదన్నారు.) ఆధార్ జిరాక్స్, స్పోర్ట్స్, ఆర్ఫన్, పీహెచ్‌సీ ధృవీకరణ పత్రం, మూడు కలర్ ఫోటోలు తీసుకుని హాజరుకావాలన్నారు. సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులలో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశం పొందాలనుకునే వారు ఎస్టీ క్యాటగిరికి చెందిన బాలురు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### పేకాట రాయుళ్లు అరెస్టు

సైదాబాద్, జూన్ 10: కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీ కాలనీలో పేకాట స్థావరంపై సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. పోలీసులకు ఓ ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నట్లు మంగళవారం సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ ఇంటి పై దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం పేకాట రాయుళ్లను కంచన్‌బాగ్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

## హయత్ నగర్ అభివృద్ధికి సహకరించండి

### జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు విజ్ఞప్తి చేసిన కార్పొరేటర్

హయత్‌నగర్, జూన్ 10 : డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో అభివృద్ధికి సహకరించాలని జీహెచ్ఎంసీ హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్యను ఆయన కార్యాలయంలో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మంగళవారం కలిసి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్‌లోని వివిధ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరమన్నారు. డివిజన్‌లోని ప్రధాన సమస్యలైన శానిటేషన్, వీధి దీపాలు, ఇంటి పన్ను వంటి వివిధ అంశాలపై చర్చించామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీను, సీనియర్ నాయకులు సురేష్, సుభద్ర కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ స్వామి, కమలానగర్ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.



హెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ యాదయ్యను కలిసిన కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి, ఆయా కాలనీవాసులు

### సమస్యల పరిష్కారానికి కృషి

హయత్ నగర్, జూన్ 10 : హయత్ నగర్ డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ బాబు, హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. హయత్ నగర్ డివిజన్‌లోని షిరిడి నగర్ కాలనీలో మంగళవారం జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాలనీలోని పలు వీధుల్లో సీసీ రోడ్ల సదుపాయం లేకపోవడంతో కాలనీవాసులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, చిన్నపాటి వర్షానికి కాలనీ రోడ్లన్నీ బురదమయంగా మారి వాహనదారులకు ప్రమాదకరంగా ఉందని కాలనీవాసులు వివరించారని తెలిపారు. ఆయా వీధుల్లో వీలైనంత త్వరగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ అధికారులను కోరారు. వారి వెంటా జీహెచ్ ఎంసీ డీఈ దామోదర్, ఏఈ హేము నాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

### బీఈ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ కోర్సుల చివరి సెమిస్టర్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

అన్ని విభాగాల బీఈ సీబీసీఎస్, బీఈ నాన్ సీబీసీఎస్, బీఈ ఏఐసీటీఈ కోర్సుల చివరి సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, వన్ టైం చాన్స్ పరీక్షలను ఈ నెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.in లో చూసుకోవాలని సూచించారు.

## జంటహత్యల కేసులో వీడిన మిస్టరీ..

### ఉద్యోగం తీసేశారన్న పగతోనే వృద్ధ దంపతుల హత్య

### మాజీ డ్రైవర్‌తోపాటు మరొకరు అరెస్ట్

బండ్లగూడ, జూన్ 10 : రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుద్వేల్ జనచైతన్య కాలనీలో గురువారం జరిగిన జంట హత్యల కేసులో మిస్టరీ వీడింది. తనను ఉద్యోగంలో నుంచి తొలగించారన్న కక్షతోనే మాజీ డ్రైవర్.. వృద్ధ దంపతులను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడు మహమ్మద్ షకీల్ సల్మాన్‌తో పాటు అతనితో వచ్చిన మహమ్మద్ ముజీవుద్దీన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. ఈనెల 5న జనచైతన్య కాలనీలోని ఆర్చిస్ రెసిడెన్సీలోని ఫ్లాట్-502లో నివసిస్తున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ జనరల్ మేనేజర్ షేక్ అబ్దుల్లా(70), ఆయన భార్య మాజీ లెక్చరర్ రిజ్వానా(65)లు హత్యకు గురైన విషయం తెలిసిందే. గతంలో రెడ్‌హిల్స్‌లో నివాసమున్నవారు ఇటీవల బుద్వేల్ జనచైతన్య కాలనీలో ఫ్లాట్ కొనుగోలుచేసి అందులోనే ఉంటున్నారు. గతంలో వారివద్ద మహమ్మద్ షకీల్ సల్మాన్ డ్రైవర్‌గా పని చేసేవాడు. అయితే అతని ప్రవర్తన నచ్చకపోవడంతో అతడిని 8 నెలల క్రితం ఉద్యోగంలో నుంచి తీసేశారు. అప్పటి నుంచి ఉపాధి దొరకక జులాయిగా తిరుగుతున్నాడు. తనను ఉద్యోగంలో నుంచి తీసేశారనే కోపంతో వారిపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో తన స్నేహితుడు మహమ్మద్ ముజీబుద్దీన్ దగ్గర సల్మాన్ రూ.40వేలు తీసుకున్నారు. డబ్బులు ఇస్తానని ముజీబుద్దీన్‌ను తీసుకుని ఈ నెల 4న రెడ్‌హిల్స్‌కు వెళ్లగా.. షేక్ అబ్దుల్లా బుద్వేల్‌కు షిఫ్ట్ అయ్యారని తెలిసింది. వెంటనే జనచైతన్య కాలనీకి వచ్చి షేక్ అబ్దుల్లా ఇంటిని చూసి లోనికి ఎలా వెళ్లాలని రెక్కీ నిర్వహించారు. ఈనెల 5న సాయంత్రం 5 గంటల సమయంలో షకీల్ సల్మాన్ బుర్ఖా ధరించి, ముజీబుద్దీన్ మాస్క్ ధరించి వాచ్‌మన్ రాజేశ్ వద్దకు వెళ్లి పొలం వద్ద నుంచి అలీ వచ్చారని షేక్ అబ్దుల్లాకు సమాచారం ఇచ్చారు. షేక్ అబ్దుల్లా క్లియరెన్స్ ఇవ్వడంతో వారిద్దరు లోనికి వెళ్లారు. సల్మాన్ తనవెంట తెచ్చుకున్న కత్తితో షేక్ అబ్దుల్లాను పొడిచాడు. ఈ హఠాత్తు పరిణామాన్ని చూసిన ముజీబుద్దీన్ అక్కడి నుంచి బయటకు పరుగులు తీశారు. అడ్డు వచ్చిన భార్య రిజ్వానాను కూడా కత్తితో దారుణంగా పొడిచి చంపాడు. నిందితుడు సల్మాన్ కొద్దిసేపు అక్కడే ఉండి మృతుడి జేబులో నుంచి రూ.600 తీసుకొని పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి.. ప్రధాన నిందితుడు సల్మాన్‌తోపాటు అతడితో వచ్చిన ముజీబుద్దీన్‌ను అరెస్ట్ చేశారు.



విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ చింతమనేని శ్రీనివాస్

సమావేశంలో ఏసీపీ తులా శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు క్యాస్ట్రో, ప్రశాంత్, సీసీఎస్, ఎస్ఓటీ పోలీసులు పాల్గొన్నారు.

### అపరిచితులతో అప్రమత్తంగా ఉండండి : డీసీపీ

అపార్టుమెంట్లలో నివాసం ఉండేవారు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి ఒక్కరు ఇంటి ముందు సీసీ కెమెరాలు అమర్చుకొని .. వ్యక్తులను పరిశీలించిన తర్వాతనే లోపలికి అనుమతించాలని సూచించారు. గేటెడ్ కమ్యూనిటీల్లో సెక్యూరిటీ సిబ్బందిని తగినంతగా నియమించి.. తనిఖీ చేసిన అనంతరం లోపలికి పంపించాలన్నారు.